

# చెట్టుకొమ్మనున్న కథ

కొన్ని కథలు నేలమీద నడుస్తాయి. కొన్ని కథలు గాలిలో ఆడుతాయి. కొన్ని కథలు చెట్టుకొమ్మన కూర్చుంటాయి.

ముక్కంటి పల్లవుడికి మూడుమూళ్ళ వయసొచ్చింది. అమ్మ పెట్టిన చద్ది తిని బడికైతే వెళ్తున్నాడుగాని పాఠాలకంటె పరుగులు, పందాలంటేనే మక్కువ. పొద్దున్నా సాయంత్రం అక్షరాల సంగతి అయ్యవార్ల కొదిలేసి ఆకతాయిల్ని చేరదీసి జట్టుకట్టి కుస్తీ పట్లు పట్టటమే ముక్కంటిపని. ఓరోజు పోటీలో తగాదా వచ్చింది. మాటలు పెరిగాయి. నువ్వెంత అంటే నువ్వెంత? అనుకున్నారు. పిల్లలు, ఒకడెవరో చెంగున లేచి ' పోరా! నీ యబ్బకి చెప్పుకోరా?' అన్నాడు

ముక్కంటిని. 'వాడికి అబ్బ లేడురా' అన్నాడు ఇంకొకడు. ఆ మాటతో ముక్కంటి నీరుగారిపోయాడు. ఎక్కడలేని కోపం వచ్చింది. పలక ఫెళ్లున పగులగొట్టాడు. బలపం ముక్కలకింద విరిచేశాడు. పగిలిన పలకతో ఇంటికొచ్చిన కొడుకుని చూసి తల్లి 'ఇదేవిఁటి?' అంది.

బలపం ముక్కలు గుప్పిట్లో పిండుతూ 'నాకు అయ్యలేడా అమ్మా?' అనడిగాడు ముక్కంటి.

'ఎవరన్నారయ్యా నీ కయ్యలేదని?' అంది తల్లి!

'ఊరూవాడా అంతా అంటున్నారమ్మా' అన్నాడు ముక్కంటి.

"వాళ్ళకే సమాధానం చెప్తాను రావయ్యా" అంటూ ముక్కంటిని చేయి పుచ్చుకుని నడివీధిలోకి తీసికొచ్చింది. పెద్ద అరుగుమీద కొడుకుని నుంచోపెట్టి పిల్లల్ని పెద్దల్ని అందర్ని కేకపెట్టి పిలిచింది. అలా పోగయిన జనసమూహానికి ముక్కంటి జన్మ చెప్పింది.

"అన్నలారా! అమ్మలారా! నా బిడ్డ ముక్కంటికి అయ్య లేడన్నారట. నే నిప్పుడు చెప్తున్నాను. నా బిడ్డకు తండ్రి ఆ అమరేశ్వరుడు ......"

జనం ముఖాలు ముఖాలు చూసుకున్నారు. చెప్పుకుపోతోంది ముక్కంటి తల్లి. "నేను విధవను. పదేళ్ళ క్రితం స్వామి ముందు సాగిలపడి నాకు సంతానం ఇవ్వమని ప్రార్థించాను. నాకు సంతానం కలిగితే పుట్టెడు నీళ్ళతో నీకు దీపారాధన చేస్తాను. పుట్టెడు ఇసకతో నీకు సమారాధన చేస్తాను అని మొక్కుకున్నాను. ఆ మొక్కుకోడం విన్న ఆడవాళ్ళు నన్ను గేలి చేశారు. ఆ తర్వాత నాకు నెలలు నిండాయి. ఈ ముక్కంటి పుట్టాడు. ఆ మొక్కుబడి ఇంతవరకు తీర్చలేదు. నాబిడ్డ తండ్రిని నిర్ధారించటం కోసమే ఇంతకాలం ఆగానేమో తేలీదు. ఇప్పుడే తీరుస్తాను" అని కృష్ణకెళ్ళి బిందెడు నీళ్ళు తీసుకొచ్చి గాబులోపోసి వొత్తి చేసి వెలిగించి దీపారాధన చేసింది. కృష్ణలో ఇసుక బుట్టెడు తీసుకొచ్చి వండి వూరందరికి సమారాధన చేసి వడ్డించింది.

ముక్కంటి పెరిగి పెద్దవాడయాడు. అయ్యవార్ల చదువు ఉపయోగించలేదు.

కాని అలనాటి ఆకతాయి జట్లు ఉపయోగించాయి. పూరూరా తన సైన్యం పెంచుకుని అప్పటిదాకా పరిపాలిస్తున్న జైన రాజుల్ని వెళ్ళగొట్టి ధరణికోట రాజధానిగా వైదిక రాజ్యం స్థాపించాడు.

ఎవరీ ముక్కంటి పల్లవుడు? 'ముక్కంటి పల్లవుడు, త్రినేత్ర పల్లవుడు, త్రినయన పల్లవుడు' అన్న పేరుగల రాజు కంచీపురం రాజధానిగా పరిపాలించాడని చరిత్ర చెప్తోంది. ఆ పేర్లతో అనేకమంది రాజులు తెలుగు దేశంలో ఉండేవారని చారిత్రకులు చెప్తున్నారు. ఎవరేం చెప్పినా మనం కథ చెప్పుకోటానికి ఇబ్బంది లేదు.

ముక్కంటి పల్లవుడు వైభవంగా వివాహం చేసుకుని రాజ్యపాలన సాగిస్తుండగా ఒకరోజు ఒక సిద్ధుడు ముక్కంటికి ఒక రహస్య మంత్రం ఉపదేశించి ఒక పాదలేపనం అనుగ్రహించాడు. ఆ పాదలేపనం సాయంతో ముక్కంటి పల్లవుడు రోజూ క్షణమాత్రంలో కాశీకి చేరుకుని, గంగలో స్నానంచేసి తిరిగి క్షణంలో రాజధానికి తిరిగి వస్తున్నాడు. ముక్కంటి భార్య తన భర్త రోజూ వెళ్ళి గంగాస్నానం చేసి వస్తున్నాడని గ్రహించింది. ఒకనాడు ఆ పాదలేపనం తనకు కూడా అనుగ్రహించమని వేడుకుంది. ముక్కంటి సమ్మతించ లేదు. ముక్కంటి భార్యకు తనూ రోజూ గంగాస్నానం చేయాలనే కోరిక అధికమైంది. జైన సిద్ధుల్ని ఆశ్రయించి వాళ్ళద్వారా ఆ పాదలేపనాన్ని సంపాదించగలిగింది. దాని సాయంతో భర్త బయలుదేరిన మరుక్షణంలో తనూ కాశీకి బయలుదేరి గంగలో స్నానంచేసి భర్త రావటానికి కొంచెం ముందుగా ఇల్లుచేరుకోవటం మొదలెట్టింది.

ఇలా కొంతకాలం గడిచింది.

ఒకరోజు ముక్కంటి భార్య గంగలో స్నానంచేసి వొడ్డుమీదికి వచ్చేసరికి వాకిటుంది. వాకిటుంటే ఆ పాదలేపనం పనిచేయదు. తత్తర పడింది. రాజధానికి చేరుకోటమెట్టా? గత్యంతరం లేక భర్తని వెతుక్కుంటూ వొడ్డు వెంటే నడిచి వెళ్లింది. అల్లంత దూరాన ముక్కంటి స్నానం ముగించుకుని వొడ్డుకు వస్తున్నాడు. అంతఃపురంలో ఉండవలసిన భార్య గంగ వొడ్డున కన్పించేసరికి ఆశ్చర్యపోయాడు. భార్యచేతులు జోడించి వివరం చెప్పి తప్పిదం వొప్పుకుంది.

మార్గాంతరం ఆలోచించమంది.

అప్పుడు ముక్కంటి కాశీలోని పండితుల్ని, సిద్ధుల్ని ఆశ్రయించి తరుణోపాయం చెప్పమని వేడుకొన్నాడు. ఈ రహస్య గంగాస్నానం ఎవరకీ తెలియదని, మేము వెంటనే అమరావతికి వెళ్ళకపోతే రాజ్యం అల్లకల్లోలమై పోతుందని వివరించాడు. పండిత పరిషత్తు ముక్కంటి దంపతుల్ని వారి తపోమహిమతో వారి రాజధానికి చేర్చటానికి ఒక షరతు పెట్టింది. "రెండు సంవత్సరాల తర్వాత కాశీరాజ్యంలో గొప్ప క్షామం రాబోతుంది. ఆ సమయంలో మేము అమరావతి వస్తాము. 'మిమ్మల్ని పోషిస్తాను' అని గంగలో నీళ్ళు వొదిలితే రాజధాని చేరుస్తాము"' అని. ఆ ప్రకారం ముక్కంటి గంగలో నీళ్ళు వదలగా దంపతులు రాజధాని చేరుకున్నారు.

రెండు సంవత్సరాలు గడిచింది.

కరువు వచ్చింది. ఆరువేల కుటుంబాలు కాశీనుండి బయలుదేరి నైజాం రాజ్యం గుండా పరిటాల మీదుగా గనాతుకూరు దగ్గరకు వచ్చేసరికి కృష్ణానది మహోధృతంగా వరదల్లో ఉంది. కృష్ణ దాటడానికి సాధనం లేదు. ఆకలితో అలమటిస్తున్న ఆ కుటుంబాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. ఆకలితో ఇక్కడ చచ్చిపోవడంకంటే కృష్ణలో దూకి ఆత్మహత్య చేసుకుందామని కృష్ణలో దూకారు. కృష్ణ రెండుపాయలుగా విడిపోయి వాళ్ళకు దోవ ఇచ్చింది. నడుచుకుంటూ అమరావతి వచ్చి ముక్కంటిని ఆనాటి వాగ్దానం నిలుపుకోవలసిందిగా కోరారు. ముక్కంటి వారందర్నీ ఆదరించి వారికి మాన్యాలిచ్చి పోషించినట్లు శాసనం ఉంది.

ఎక్కడ ఉంది శాసనం?

ఏ ఇంటి పునాదిలోనో! ఏ భూగర్భంలోనో!

ఇది పుక్కిటి పురాణం కావచ్చు, కట్టు కథ కావచ్చు, ఆ శాసనం దొరికి పలికితే తప్ప చెట్టు కొమ్మనున్న కథ చేతికందదు.*